## రాష్ట్రపతి ఉత్తర్వులు
## (ఆరుసూత్రాల పధకం)

**చారిత్రక నేపథ్యం**

భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేసే సందర్భంలో మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయిన ఆంధ్ర రష్ట్రాన్ని నిజాం పరిపాలన నుండి విముక్తి చెందిన హైదరాబాదు రాష్ట్రాన్ని కలిపి తెలుగుభాష మాట్లాడేవారికి ఒకే రష్ట్రం ఏర్పాటు పరిశీలనకై కేంద్ర ప్రభుత్వం 1995 లో శ్రీ ఫజల్ ఆల్ అధ్యక్షతన రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ కమీషన్ ఏర్పాటు చేసింది. ఈ కమీషను ఇదివరకటి హైద్రాబాదు రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతాన్ని 1960 దాకా విడిగా అలాగే కొనదాగించాలని సిఫారసు చేసింది. అంతేగాక ఏర్పడే శాసనసభలోని 2/3 వంతు తెలంగాణ ప్రాంత శాసనసభ్యులు అంగీకరిస్తేనే తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల విలీనం జరగాలని కూడ సూచించింది.

ఈ సిఫారసులను, సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా రెండు ప్రాంతాలను కలిపి విశాలాంధ్ర ఏర్పాటుకు ఆయా ప్రాంత పెద్ద మనుషులు ఒక అంగీకారానికి వచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని నిర్దేశించిన ముల్కీ రూల్స్ని యధాతధంగా కొనసాగించాలి. కాని ఈ ఒప్పందం చట్టబద్ధం చేయలేదు. అయితే పబ్లిక్ ఎంప్లాయ్ మెంట్ యాక్ట్, 1957లో దాని క్రింద 1959లో జారీచేసిన రూల్స్ ప్రకారం కొన్ని ఉద్యోగాలకు తెలంగాణ ప్రాంతంలో కనీసం 15 సంవత్సరాలు నివాసమున్నవారే అర్హులని సెక్షన్ 3లో నిబంధన చేర్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ జరిగిన సమయంలో తెలంగాణ ప్రాంతంలో విద్యాసౌకర్యాలు సరిగా లేవు. టీచర్/నర్సు ట్రైనింగ్‌సంస్థలు కూడా తక్కువ. కొన్ని పోస్టులకు కావలసిన సాంకేతక విద్యార్హతలు గలవారు అందుబాటులో లేనందున స్థానికేతరులతో ఆ ఖాళీలు నింపారు. ఇదే కారణంతో ఇరర ఉద్యోగాలలో కూడ స్థానికేతరులను తీసుకున్నారు. 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పర్యవసానంగా 4500 మంది గైరు ముల్కీలను (స్థానికేతరులను) ఆంధ్ర ప్రాంతానికి తరలించారు. బాధితులలో కొందరు నివాస ప్రాతిపదికన ఉద్యోగాలివ్వాలని తెచ్చిన 1957వ సంవత్సరపు యాక్టుకు వ్యతిరేకంగాను కోర్టుకు వెళ్ళారు. సుప్రీంకోర్టు ఆ నిబంధనను కొట్టివేసింది (ఎఐఆర్1970 ఎస్.సి. 422). తెలంగాణ ప్రాంత ఉద్యోగులలో, ప్రజలలో అసంతృప్తి, అభద్రతా భావం నెలకొన్నది. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్జీవోలు 50 రోజులకు పైగా సమ్మె జరిపారు. సుప్రీంకోర్టు కొట్టివేసిన నిబంధనకు రాజ్యాంగ సవరణతో చట్టబద్ధత కల్పించమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందింగాంధీ తెలంగాణ సమస్యను పాలకపక్ష, ప్రతిపక్షనాయకులతో చర్చించి 8 సూత్రాల ప్రణాళిక ప్రకటించారు. రాజ్యాంగబద్ధ హామీ ఇచ్చే అవకాశాన్ని న్యాయకోవిదులతో చర్చించి పరిశీలించాలన్నది ఆ ఎనిమిది సూత్రాలలో ఒకటి.

1957 యాక్టులోని సెక్షను 3ను సుప్రీంకోర్టు కొట్టివేసిన దరిమిలా విలీనానికి పూర్వం తెలంగాణ ప్రాంతంలో అమలులో ఉన్న ముల్కీ రూల్స్ పునరుద్ధరించబడినవని సుప్రీంకోర్టు 3.10.1972న మరొక సంచలనాత్మక తీర్పు చెప్పింది. (ఎ.ఐ.ఆర్. 1973 ఎస్.సి. 827) దానితో ఆంధ్ర ప్రాంతం వారు భయాందోళనకు గురి అయినారు. ఆ ప్రాంత ఎన్జీవోలు 100 రోజులకు పైగా సుదీర్ఘ సమ్మె జరిపి ప్రత్యేక రాష్ట్రం కొరకు జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రెండు ప్రాంతాలు సమైక్యంగా ఒకే రాష్ట్రంలో కొనసాగడానికి తెలంగాణతో సహా ఇతర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ఆ ప్రాంత ఉపాధి అవకాశాలు మరియు విద్యా సౌకర్యాల వెరుగు లక్ష్యంగా 6 సూత్రాల పధకం రూపొందించి అమలు చేయమని 21.09.1973 రాష్ట్రానికి అందజేసింది.

పధకమ సారాంశం

1. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల శీఘ్ర పురోగతి,
2. విద్యాసంస్థలలో అడ్మిషనులలో స్థానికులకు ప్రాధాన్యత, హైదరాబాదులో కేంద్ర విశ్వవిద్యాలయ స్థాపన,
3. సెక్రటేరియట్, శాఖాధిపతుల కార్యాలయములు మరుయు హైదరాబాద్ నగర పోలీసు తప్ప మిగతా ప్రభుత్వ కార్యాలయాలలోను, స్థానిక సంస్థలలోను ఎన్జీవో ఉద్యోగాలకు మరియు తహశీలుదారు, జూనియర్ ఇంజనీరు మరియు అసిస్టెంటు సివిల్ సర్జన్

ఉద్యోగాలకు ప్రత్యక్ష నియామకాలలో స్థానిక అభ్యర్థులకు ప్రాధ్యాన్యత నివ్వాలి. వారి ప్రదోన్నతి అవకాశాలు మెరుగుపరచాలి. అందుకొరకు తగినన్ని సర్వీసు కేడరుల నేర్పాటు చేయాలి.

4. సర్వీసు విషయాలలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ఒక ఉన్నతశ్రేణి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ను ఏర్పాటు చేయాలి,
5. ఈ సూత్రాల అమలుకు అవసరమైన చర్యలు గైకొనుటకు రాష్ట్రపతికి అధికారమిస్తూ రాజ్యాంగాన్ని తగు విధంగా సవరించాలి,
6. తెలంగాణ పరిరక్షణకు ఏర్పాటైన ముల్కీ రూల్స్ మరియు ప్రాంతీయ కమిటీలు ఇక అవసరం లేదు.

రాజ్యాంగ సవరణ

ఆరు సూత్రాల పథకం అమలులో భాగంగా తేది 3.5.1974న 32వ రాజ్యాంగ సవరణ చట్టం తెచ్చారు. అందులో 371-డి మరియు 371-ఇ ఆర్టికల్స్ కొత్తగా చేర్చారు.

ఆర్టికల్ 371 - డి

ఈ క్రింద విషయాలలో ఉత్తర్వులివ్వడానికి రాష్ట్రపతికి అధికారమివ్వబడింది.

1. మొత్తం మీద రాష్ట్రావసరాలను దృష్టియందుంచుకొని ప్రభుత్వ ఉద్యోగాలు మరియు విద్యా సౌకర్యాల విషయంలో రాష్ట్రంలోని వేరువేరు ప్రాంతాలకు ప్రత్యేక నిబంధనలు విధించవచ్చును.
2. కొన్ని తరగతుల పోస్టులను లోకల్ కేడర్ లుగా ఏర్పాటుచేసి ఆ పదవులు నిర్వహిస్తున్న ఉద్యోగు లను సదరు లోకల్ కేడరుకు కేటాయించవచ్చును.
3. ప్రభుత్వంలోని, స్థానిక సంస్థలలోని లోకల్ కేడర్ ఉద్యోగాలకు ప్రత్యక్ష నియామకం చేయుటకు మరియు యూనివర్సిటీ, ఇతర విద్యా సంస్థలలో అడ్మిషన్ లకు ఆయా లోకల్ ఏరియాలో నివాసమున్నవారికి రిజర్వేషన్ లు కల్పించవచ్చును.
4. ప్రభుత్వ కార్యాలయాలలోని, స్థానిక సంస్థలోని ఉద్యోగుల సర్వీసు నిబంధనలు పరిష్కరించుటకు ఒక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేయవచ్చును. ఉద్యోగుల సర్వీసు విషయాలపై సుప్రీంకోర్టులో తప్ప ఇతర కోర్టులు, ట్రిబ్యునల్ కు బదిలీ చేయవచ్చును.
5. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణకు ముందు పూర్వపు హైద్రాబాదు రాష్ట్రంలోను మరియు ఆ తరువాత్ సమైక్య రాష్ట్రంలో 32వ రాజ్యాంగ సవరణ చట్టం 1973 అమలులోనికి రాక పూర్వం ప్రభుత్వ/స్థానిక సంస్థల ఆధీనంలోని ఉద్యోగాలలో స్థానికేతతులఅ కిచ్చిన నియామకాలు, పోస్టింగులు ప్రమోషన్ లు, బదిలీలు అన్నింటికీ చట్టబద్ధత కల్పించవచ్చును.

అంతేగాక ఈ ఆర్టికల్ లోని (10) క్లాజులో రాష్ట్రపతికి విస్తృతమైన సర్వశక్తివంతమైన అధికారాన్ని దఖలు పరిచారు. ఆ ఉత్వర్వు రాజ్యాంగంలోని ఇతర ఆర్టికల్స్ కు గాని లేక ఇతర చట్టాలలోని అంశాలకుగాని ప్రతికూలంగా ఉన్నప్పటికీ చెల్లుబాటవుతుంది.

ఆర్టికల్ 371 - ఇ

ఆంధ్రప్రదేశ్ లో ఒక విశ్వవిద్యాలయం నెలకొల్పుటకు పార్లమెంటులో చట్టం తేవచ్చును.

రాష్ట్రపతి ఉత్తర్వు (జీ.ఓ.ఎం.ఎస్.నెం.674, తేది. 20.10.1975)

ఈ ఉత్తర్వు ప్రభుత్వాధీనంలోని పోస్టులకే కాక వాటితో సారూప్యతగల స్థానిక సంస్థలలోని పోస్టులకు కూడా వర్తిస్తుంది.

లోకల్ కేడరుల ఏర్పాటు (పేరా - 3)

1. ఈ ఉత్తర్వు తేది 18.10.1975 నుండి అమలులోనికి వచ్చింది. అప్పటి నుండి 27 నెలలలోగా రాష్ట్రంలోని వేరువేరు ప్రాంతాలలోని వివిధ పోస్టులను ప్రత్యక లోకల్ కేడర్లుగా ఏర్పాటు చేయాలి. ఈ గడుపు 17.01.1978తో ముగిసింది. ఈ విధంగా ఏర్పాటైన లోకల్ కేడరు ఆయా కేటగిరీ పోస్టులకు నియామకానికి, సీనియారిటీకి, ప్రమోషనుకు, బదిలీకి, ఉద్వాసనకు ఒక ప్రత్యేక యూనిట్ గా పరిగణింపబడుతుంది. (పేరా 5(1)). అయితే ఈ గడువు దాటిన తరువాత కూడ రాష్ట్రపతి అవసరమని భావించినచోట ఏ తరగతికి చెందిన పోస్టులైనా ఆయా ప్రాంతాలలో లోకల్ కేడర్లుగా ఏర్పాటు చేయమని ఆదేశించవచ్చును.

2. ఎల్.డి.సి., అంతకు తక్కువ స్థాయి పోస్టులను జిల్లా స్థాయిలో ప్రత్యేక కేడరుగా ఏర్పాటు చేయాలి. జిల్లా స్థాయి కన్న తక్కువస్థాయి అనగా డివిజన్, తాలుకా స్థాయిలో నియామక యూనిట్లను అలాగే కొనసాగించాలి. అలాగాక జిల్లా స్థాయికి మించియున్న యూనిట్లను జిల్లావారీగా ప్రత్యేక కేడరులుగా విభజించాలి.

3.

ఇతర నాన్ గెజిటెడ్ పోస్టులను రెండు, అంతకన్న ఎక్కువ జిల్లాలు గల జోన్ లవారీగా ప్రత్యేక కేడర్లుగా ఏర్పాటు చేయాలి. అయితే పాఠశాల విద్య సబార్డినేటు సర్వీసులోని పోస్టులు మరియు వాటితో సమానమైన లేదా సారూప్యత గ ఉపాధ్యాయ పోస్టులకు మాత్రము తేది.1.1.1994 నుండి ప్రతి జిల్లా ఒక ప్రత్యేక లోకల్ ఏరియాగా పరిగణించాలని ఎస్.ఒ. 106(ఇ), తేది 04.02.2000 ద్వారా రాష్ట్రపతి ఉత్తర్వుకు సవరణ తెచ్చారు.

వివిధ జోన్ లు, జిల్లాలు

జోన్ - 1 : శ్రీకాకుళం, విజయనగరం, మరియు విశాఖపట్నం.

జోన్ - 2 : తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి మరియు కృష్ణా.

జోన్ - 3 : గుంటూరు, ప్రకాశం మరియు నెల్లూరు.

జోన్ - 4 : చిత్తూరు, కడప, అనంతపురం మరియు కర్నూలు.

జోన్ - 5 : ఆదిలాబాదు, కరీంనగర్, వరంగల్ మరియు ఖమ్మం.

జోన్ - 6 : హైద్రాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్ నగర్, మెదక్ మరియు నల్గొండ.

అనగా కోస్తా ఆంధ్ర ప్రాంతాన్ని 1,2,3 జోనులుగాను, రాయలసీమ ప్రాంతాన్ని 4వ జోన్ గాను, తెలంగాణ ప్రాంతాన్ని 5,6 జోనులుగా విభజించారు. రాష్ట్ర రాజధానియైన హైద్రాబాద్ నగరాన్ని 6వ జోన్ లో ఒక ప్రత్యేక కేడర్గా ఏర్పాటు చేశారు.

అయితే రెవిన్యూ డిపార్టుమెంట్ లోని డిప్యూటీ తహశీలుదారు పోస్టులకు జిల్లాయే నియామక యూనిట్ గా ఉన్నది. అలాంటి పోస్టుల నియామక యూనిట్లను అలాగే కొనసాగించాలి. జోన్లవారీగా మార్చనవసరం లేదు. అదే విధంగా సంబంధిత జోన్ పరిధిలో జోన్ పరిధిలో జోన్ కన్న తక్కువ స్థాయి నియామక యూనిట్లను కూడ మార్చనవసరం లేదు. అలాగే కొనసాగించాలి. అలాగాక 18.10.1975 తేదీకి పూర్వమున్న యూనిట్ ఏరియా రాష్ట్రపతి ఉత్తర్వులో ఏర్పాటు చేసిన జోన్ పరిధి దాటినట్లయితే ఆ యూనిట్ల పరిధిని జోన్ కు కుదించాలి. ఆంధ్ర, తెలంగాణ మరియు రాయలసీయ ప్రాంతాలవారీగా ఉన్న యూనిట్లను మల్టీజోన్ లుగా ప్రకటించకపోతే జోన్ లుగా విభజించాలి. (జీ.ఓ.నెం.728, తేది1.11.1975).

4. ప్రతి శాఖలో కొన్ని నిర్దిష్టమైన గెజిటెడ్ పోస్టులను కూడా జోన్ ల వారీగా ప్రత్యేక కేడరులుగా ఏర్పాటుచేయాలి. ఆ వివరాలు జీ.ఓ.నెం. 674, తేది 20.10.1975 మొక్క షెడ్యూలు -3 లో ఇవ్వబడినవి.

5. కేంద్ర ప్రభుత్వ అనుమతితో పొరుగున ఉన్న రెండు లేక అంతకన్న ఎక్కువ జోన్ లలోని ఏవైనా ఎల్.డి.సి. కన్న ఎక్కువ స్థాయి నాన్ గెజిటెడ్ లేక నిర్దిష్ట గెజిటెడ్ పోస్టులను ప్రత్యేక జోన్ లు/మల్టీ జోన్ లుగా నిర్ణయించవచ్చును.

ఈ అంశం క్రింద రాష్ట్రంలోని కొన్ని పోస్టులను రెండు లేక మూడు మల్టీ జోన్ లుగా ఎర్పాటు చేశారు. ( జీ.ఓ.నెం.682, తేది 29.11.1998, జీ.ఓ.నెం.541, తేది.8.8.1977, జీ.ఓ.నెం.682, తేది.29.11.1989).

మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టరు పోస్టులను, విద్యాశాఖలోని పరిషత్తు విద్యాధికారి పోస్టులని, ఆర్థిక గణాంక శాఖలోని స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులను, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి పోస్టులని మరియు రిజర్వు పోలీసు ఇన్ స్పెక్టర్ పోస్టులను మరియు రిజర్వు పోలీసు ఇన్ స్పెక్టర్ పోస్టులను కోస్తా ఆంధ్ర ప్రామ్తాన్ని ఒక జోన్ గా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలను కలిపొ మరొక జోన్ గా ఏర్పాటు చేశారు. గనులశాఖలోని నాన్ గజిటెడ్ పోస్టులైన రాయల్టీ ఇన్ స్పెక్టరు, టెక్నికల్ అసిస్టెంత్ పోస్టులను కోస్తా ఆంధ్ర ప్రాంతంలోని జోన్ 1,2 లతో పాటు తెలంగాణ ప్రాంతపు జోన్ 5,6వ జోన్ లో ఒక ప్రత్యేక కేడరులుగా ఏర్పాటు చేశారు.

6. హైదరాబాదు నగరంలోని పోస్టులను 6వ జోన్ లో ఒక ప్రత్యేక జిల్లా కేడరుగా ఏర్పాటు చేయాలి.

రాష్ట్రపతి ఉత్తర్వులోని పేరా 2(1)(ఎ)లో పేర్కొన్న ప్రకారం మొదటి షెడ్యూలులో తెల్పిన ప్రాంతాలు హైదరాబాదు నగర కేడర్ లో చేర్చబడినవి. జి.ఎస్.ఆర్. 528(ఇ)లో కేంద్ర ప్రభుత్వం కొన్ని శాఖలకు చెందిన నాన్ గజిటెడ్ పోస్టులను హైద్రాబాద్ నగరానికి ప్రత్యేక కేడరులుగా ఏర్పాటు చేసింది. (జీ.ఓ.నెం. 675, తేది 10.03.1975, జీ.ఓ.నెం. 498, తేది 22.06.1977, జీ.ఓ.నెం.168, తేది 10.03.1977, జీ.ఓ.నెం. 34, తేది 24.01.1981)

15.08.1978 నుండి రంగారెడ్డి జిల్లా ఆవిర్భావంతో ఆ జిల్లాలో చేర్చబడిన ప్రాంతాలు హైదరాబాదు నగర కేడర్ నుండి తొలగించబడినట్లు భావించాలి. ఆ ప్రాంతాలకు చెందిన ఎల్.డి.సి., అంతకన్న తక్కువ స్థాయి పోస్టులను రంగారెడ్డి జిల్లా కేడరులో చేర్చాల్సి విన్నది. అయితే పాఠశాల విద్యాశాఖకు చెందిన పోస్టుల విషయం లో మాత్రం హైదరాబాదు రెవిన్యూ జిల్లాలోని పోస్టులను ఒక ప్రత్యేక కేడరుగా ఏర్పాటు చేయాలి (జీ.ఓ.నెం. 2, తేది 03.01.2002).

7. ఏ శాఖలోని ఏ ప్రాంతపు పోస్టులనైనా రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రత్యేక కేడరులుగా ఏర్పాటు చేయవచ్చును. ఒక కేటగిరీ పోస్టులను రెండు లేక అంతకన్న ఎక్కువ లోకల్ కేడర్లుగా కొనసాగించవచ్చు లేదా ఏర్పాటు చేయవచ్చును.

   ఉదాః రెవిన్యూశాఖలో డివిజన్ నియామక యూనిట్ గల ఎల్.డి.సి. కన్న తక్కువ స్థాయి ఉద్యోగాల విషయం లో జిల్లా స్థాయిలో ఒకటికన్న ఎక్కువ లోకల్ కేడర్లు ఏర్పాటవుతాయి. కాని ఆ పోస్టుకు ప్రత్యక్ష నియామకం చేయాలంటే మొత్తం ఆ జిల్లాకు చెందిన అభ్యర్థులందరూ ఆ జిల్లాలోని అన్ని డివిజన్ ల పోస్టులకు స్థానికులే. (జీ.ఓ.నెం. 729, తేది 1.11.1975, పేరా 17.)

8. ఏ శాఖలోని ఏ నాన్ గజిటెడ్ పోస్టులనైనా ప్రత్యేక కేడరుగా ఏర్పాటు చేయడం తగదని లేక ఆచరణ సాధ్యం కాదని భావించినచో ఆ విషయం కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఆ ప్రకటనతో ఆ పోస్టులు రాష్ట్రపతి ఉత్తర్వుకు అతీతంగా మారుతాయి. లోకల్ కేడరుల ఏర్పాటు చేయనవసరం లేదు. అనగా ఆ పోస్టులకు 18.10.1975కు ముందున్న రూల్స్ ప్రకారమే నియామకం జరుగవలసి ఉంటుంది.

   ఈ అంశం అమలులో భాగంగా జి.ఎస్.ఆర్. 529(ఇ), తేది 18.10.1975 ద్వారా వివిధ శాఖలకు చెందిన నాన్ గెజిటెడ్ పోస్టులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత మరికొన్ని నాన్ గెజిటెడ్ పోస్టులను అందులో చేర్చారు. (జీ.ఓ.నెం. 168, తేది 10.03.1977, జీ.ఓ.నెం. 498, తేది 16.07.1977) ఫైర్ సర్వీసు శాఖలోని యుడిసి, ఆకౌంటెంట్ పోస్టులు, చేనేత, జౌళి శాఖలోని మినిస్టీరియల్ పోస్టులు కూడా ఈ ప్రకటనలో చేర్చబడినవి.

9. జోన్, మల్టీజోన్ ల వారీగా ఏర్పాటు చేయవలసిన నిర్దిష్టమైన గెజిటెడ్ ఆఫీసరు పోస్టులు తప్ప మిగతా గెజిటెడ్ పోస్టులకు రాష్ట్రం మొత్తం నియామక యూనిట్ గా భావించాలి.

10. మినహాయింపు (పేరా 14 ) ః దిగువ తెల్పిక ఉద్యోగాలు రాష్ట్రపతి ఉత్తర్వు నుండి మినహాయించారు.

1. సెక్రటేరియట్ లోని ఉద్యోగాలు
2. శాఖాధిపతి కార్యాలయం లోని ఉద్యోగాలు.
3. జి.ఎస్.ఆర్. 526(ఇ), తేది 18.10.1975లో ప్రకటించిన ప్రత్యేక ఆఫీసులు, సంస్థలలోని ఉద్యోగాలు.
4. జి.ఎస్.ఆర్. 527(ఇ), తేది 18.10.1975లో ప్రకటించిన రష్ట్రస్థాయి ఆఫీసులు, సంస్థలలోని ఉద్యోగాలు.
5. జి.ఎస్.ఆర్. 525(ఇ), తేది 18.10.1975లో ప్రకటించిన మేజరు డెవలప్ మెంట్ ప్రాజెక్టులలోని గెజిటెడ్ ఉద్యోగాలు.
6. హైదరాబాదు నగర పోలీసు చట్టం 1348 ఫస్లీలోని సెక్షను 3 క్లాజు (బి) లో నిర్వచించిన పోలీసు ఆఫీసర్ల ఉద్యోగాలు.

ఈ పోస్టులను రాష్ట్రపతి ఉత్తర్వులో ఆదేశించిన విధంగా లోకల్ కేడర్లుగా ఏర్పాటు చేయనవసరం లేదు.

రాష్ట్రపతి ఉత్తర్వు అమలులో భాగంగా ప్రతి శాఖలో వివిధ కేటగిరీల పోస్టులను జిల్లా, జోన్ మల్టీజోన్ లవారీగా లోకల్ కేడర్లుగా ఏర్పాటు చేయడానికి గుర్తించాలి. ఆ తరువాత 18.10.1975కు పూర్వమున్న కేడర్లు రాష్ట్రపతి ఉత్తర్వుకు అనుగుణంగా అంతకుముందున్న నియామక యూనిట్లు మార్చాలి. అవసరమైన మేరకు పరిధులను తిరిగి సర్దుబాటు చేసి ప్రత్యేక లోకల్ కేడర్లు ఏర్పాటు చేయాలి. ఈ సర్దుబాటులో పనిభారం పెరిగిన సందర్భంలో అవసరమైన అదనపు పోస్టులు మంజూరు చేయబడతాయి.

లోకల్ ఏరియాలు ( పేరా 6)

లోకల్ కేడర్లుగా ఏర్పాటు చేయబడిన పోస్టులనూ ప్రత్యక్ష నియామకంచే భర్తీ చేయడానికి ఆయా జిల్లాలు, జోనులు లేదా మల్టీ జోనులు లోకల్ ఏరియాలుగా పరిగణించాలి. అనగా స్థానికులకు రిజర్వు చేసిన ఖాళీలు ఆ లోకల్ ఏరియాకు చెందినవారి చేతనే భర్తీ చేయాలి.

హైద్రాబాదు నగర కేడర్ విషయంలో హైదరాబాదు నగరంలో చేర్చిన ప్రాంతం లోకల్ ఏరియా అవుతుంది.

హుడా లోని జూనియర్ అసిస్టెంట్, అంతకన్న ఎక్కువ స్థాయి పోస్టులకు ప్రత్యక్ష నియామకం చేయుటకు 6వ జోన్ అనగా నల్గొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి, మెదక్ మరియు నిజామాబాదు జిల్లాలు లోకల్ ఏరియాగా ప్రకటించబడ్డాయి.

రాష్ట్ర ప్రభుత్వ ఏ శాఖలోని ఏ నాన్ గెజిటెడ్ పోస్టుకైనా ప్రత్యక్ష నియామకం చేయుటకు రాష్ట్రంలోని ఏ ప్రాంతాన్నయినా లోకల్ ఏరియాగా ప్రకటించుటకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారమివ్వబడింది. (ఎస్.ఓ. 106(ఇ) తేది 4.2.2000)

వ్యక్తుల కేటాయింపు (పేరా - 4)

రాష్ట్రపతి ఉత్తర్వు పేరా 3లోని నిబంధనల ననుసరించి ప్రత్యేక లోకల్ కేడరులను ఏర్పాటు చేసిన తదుపరి ఆ పోస్టులను నిర్వహిస్తున్న ఉద్యోగులను వారికి చెందిన లోకల్ కేడరులకు (జిల్లా, జోన్, మల్టీ జోన్ లకు) కేటాయించాలి. కేటాయింపు విషయంలో దిగువ తెల్పిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

1. లోకల్ కేడరులో ఆ పోస్టుల అవసరాలు
2. వ్యక్తుల వయసు, సీనియారిటీ
3. లోకల్ ఏరియాలో చేసిన సర్వీసు
4. లోకల్ ఏరియాలో అమలులో ఉన్న చట్టం మరియు ఆ వ్యక్తులు మాట్లాడే భాష
5. లోకల్ ఏరియాకు చెందిన వ్యక్తులకు సాధ్యమైన మేరకు ప్రాధాన్యత ఇవ్వాలి

అందులోసం అవసరమైన సమాచారం తెలుపుటకు ఒక నమూనా ఫారం తయారుచేసి శాఖాధికారులకు, జిల్లా కలెక్టర్లకు పంపించారు. నాన్ గెజిటెడ్ ఉద్యోగుల వివరాలు సంబంధిత శాఖాధిపతికి, గెజిటెడ్ ఉద్యోగుల వివరాలు ప్రభుత్వానికి పంపాలి. అందిన వివరాలు పరిశీలించి లోకల్ కేడరులకు ఉద్యోగులను కేటాయించడానికి తగిన సలహాలు ఇవ్వడానికి ప్రభుత్వం వివిధ కమిటీలను ఏర్పాటు చేసింది. (జీ.ఓ.ఎం.ఎస్.నెం. 124 తేది 24.11.1975, జీ.ఓ.ఎం.ఎస్.నెం. 539 తేది 22.11.1985, జీ.ఓ.ఎం.ఎస్.నెం. 124 తేది 07.03.1992) ఆ కమిటీ సిఫారసు మేరకు ఉద్యోగుల కేటాయింపు జరుగుతుంది.

లోకల్ కేడరు కేటాయింపు విభేదించే ఉద్యోగులు కేటాయింపు ఉత్తర్వు అందిన (60) రోజులలోగా ప్రభుత్వానికి తమ అభ్యంతరాలు పరిశీలించి సంబంధిత కమిటీతో సంప్రదించి ప్రభుత్వం యుక్తమైన ఉత్తర్వులు జారీ చేస్తుంది. పరిశీలనలో ఏ ఇతర వ్యక్తి కేటాయింపు మార్పు చేయవలసిన పరిస్థితి వస్తే ఆ వ్యక్తికి నోటీసు ఇచ్చి తగు వివరణ ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలి. ఇచ్చిన వివరణ కూడా పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలి.

అయితే ప్రారంభంలో చేసిన కేటాయింపులు తిరగదోడరాదని జీ.ఓ.ఎం.ఎస్.నెం. 519 తేది 18.11.1985లో ఉత్తర్వులు జారీ చేశారు.

**స్థానిక అభ్యర్థులు ( పేరా 7)**

ప్రత్యక్ష నియామకాలలో సంబంధిత లోకల్ ఏరియాకు చెందిన స్థానిక అభ్యర్థులకు కోటా నిర్ణయించారు. ఆ కోటా అమలుపరచుటకు స్థానిక అభ్యర్థి ఎవరో ముందుగా తెలుసుకోవలసి ఉన్నది. రాష్ట్రపతి ఉత్తర్వు పేరా 7లో అనేక షరతులతో స్థానిక అభ్యర్థికి నిర్వచనం ఇచ్చారు. యస్.యస్.సి. లేక అంతకన్న ఉన్నత విద్యార్హతలు అవసరమైన పోస్టులకు యస్.యస్.సి. పరీక్ష మొదట హాజరైన సంవత్సరానికి పూర్వం వరుసగా కనీసం 4 సంవత్సరాలు ఏ ప్రాంతంలో విద్యాభ్యాసం చేసినా లేక నివాసమున్నా ఆ ప్రాంతానికి స్థానిక అభ్యర్థి అని ఒక స్థూల నిర్వచనమిచ్చారు. అనగా వరుసగా 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఏ జిల్లాలో లేక ఏ జోన్ లోని ప్రభుత్వ పాఠశాలలో గాని ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలలో విద్యాభ్యాసం చేసినవారు ఆయా జిల్లాకు లేక అటెండరు, వాచమెన్ లాంటి పోస్టులకు సంబంధిత సర్వీసు నియమావళిలో విహితపరచిన విద్యార్హత పరీక్షకు వరుసగా కనీసం 4 సంవత్సరాలు విద్యాభ్యాసం/ నివాసం చేసిన ప్రాంతానికి ఆ వ్యక్తి స్థానిక అభ్యర్థి, పరీక్ష తప్పి చదువు మధ్యలో ఆఓయ్చేసుబ వారి విషయంలో ఆ అమ్తరాయ కాలాన్ని విస్మరించి ఆ 4 సంవత్సరాల కాలాన్ని లెక్కించాలి. 4 సంవత్సరాల కాలంలో ఇతర కారణాలపై విద్యాభ్యాసం చేయని కాలంలో లేక ప్రభుత్వ గుర్తింపులేని విద్యాసంస్థలలో చదివినా కూడా ఆ వ్యక్తి ఆ లోకల్ ఏరియాలో నివాసమున్నచో ఆ ప్రాంతానికి స్థానిక అభ్యర్థిగా పరిగణింపవచ్చును.

కొన్ని పోస్టులకు ఏ విద్యార్హతలు అవసరం ఉండవు. అనగా చదవడం, రాయడం వస్తే చాలు. ఆ పోస్టులకు ప్రత్యక్ష నియామకానికి ప్రకటించిన నోటిఫికేషన్ తేదీ నుండి అంతకుముందు కనీసం 4 సంవత్సరాలు వరుసగా ఏ ప్రాంతంలో నివాసమున్నారో ఆ ప్రాంతానికి స్థానిక

అభ్యర్ధులు, ఇందు కోసం అభ్యర్థి వాస్తసంగా నివాసమున్న ప్రాంతమే లెక్కలోనికి తీసుకోవాలి. కాని ఆ అభ్యర్థి తల్లిదండ్రుల నివాసం కాదు.(జీ.ఓ.ఎం.ఎస్.నెం. 168, తేది 10.03.1977) అయితే ప్రత్యేక పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన గ్రుడ్డివారు, చెవిటివారు తమ తల్లిదండ్రుల జన్మస్థలానికి సంబంధించిన లోకల్ ఏరియాకు స్థానిక అభ్యర్ధులు(జీ.ఓ.ఎం.ఎస్.నెం. 104, తేది 24.03.2000)

పైన పేర్కొన్న 4 సంవత్సరాలలో రెండు లేక అంతకన్న ఎక్కువ లోకల్ ఏరియాలలో విద్యాభాసం చేసినా/నివాసమున్నా ఆ వ్యక్తిని సదరు నిర్వచనం ప్రకారం ఏ లోకల్ ఏరియాకు స్థానిక అభ్యర్థిగా పరిగణింప వీలులేదు. ఆ సందర్భాలలో 4 సంవత్సరాలకు బదులు 7 సంవత్సరాలలో ఎక్కువ కాలం ఏ లోకల్ ఏరియాలో విద్యాభ్యాసం చేసినా లేక నివాసమున్నా ఆ వ్యక్తి ఆ ప్రాంతానికి స్థానిక అభ్యర్థి రెండు లేక అంతకన్న ఎక్కువ లోకల్ ఏరియాలలో సమానకాలం విద్యాభ్యాసం/నివాసం చేసినపుడు చివరగా విద్యాభ్యాసం/నివాసం చేసిన లోకల్ ఏరియాకే స్థానిక అభ్యర్థిగా పరిగణించాలి.

రిజర్వేషనులు

యల్.డి.సి. అంతకన్న తక్కువ స్థాయి పోస్టులకు మరియు తేది 1.6.2001 నుండి ఏ.పి. పాఠశాల విద్యాశాఖ సబార్డినేటు సర్వీసుకు చెందిన టీచరు పోస్టులకు జిల్లాయే లోకల్ ఏరియాగా పరిగణించాలి. ఆ పోస్టులకు చేసే ప్రత్యక్ష నియామకాలలో 80 శాతం స్థానిక అభ్యర్ధులకు రిజర్వు చేయాలి.

యల్.డి.సి. కన్న ఉన్నతమైన నాన్ గెజిటెడ్ పోస్టులను ప్రత్యక్ష నియామకం ద్వారా భర్తీ చేసేటప్పుడు 70 శాతం ఖాళీలు స్థానిక అభ్యర్ధులతో నియామకం చేయాలి.

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, వ్యవసాయాధికారి మరియు మోటారు వాహనాల ఇన్ స్పెక్టరు పోస్టులకు ప్రత్యక్ష నియామకాలలో 60 శాతం ఖాళీలు స్థానికులకు రిజర్వు చేయాలి.

మల్టీజోన్ లు లోకల్ ఏరియాగా ఉన్న యల్.డి.సి. కన్న ఉన్నతమైన నాన్ గెజిటెడ్ పోస్టులకు ప్రత్యక్ష నియామకాలలో 70 శాతం మరియు పైన పేర్కొన్న అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, వ్యవసాయాధికారి మరియు మోటారు వాహనాల ఇన్ స్పెక్టరు పోస్టుల విషయంలో 60 శాతం 2వ షెడ్యూలులో ఆయా జోన్ లకు ఎదురుగా చూపిన నిష్పత్తిలో స్థానిక అభ్యర్ధుల నియామకం చేయాలి.

అయితే సివిల్ అసిస్టెంట్ సర్జను ఉద్యోగాలను ప్రత్యేకంగా లోకల్ కేడరుగా ఏర్పాటు చేయనందున మొత్తం రాష్ట్ర నియామక యూనిట్ గా తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష నియామకం చేత భర్తీ చేసే ఖాళీలలో 60 శాతం స్థానిక అభ్యర్ధులకు ఈ క్రింది విధంగా కేటాయించాలి.

| క్రసం | ఈ జిల్లాలలోని స్థానిక అభ్యర్ధులు | వాటా శాతం | 60 ఖాళీలలో ఎన్ని ఖాళీలు |
|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం, విజయనగరం, మరియు విశాఖపట్నం. | 13 | 8 |
| 2 | తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి మరియు కృష్ణా. | 18 | 11 |
| 3 | గుంటూరు, ప్రకాశం మరియు నెల్లూరు. | 15 | 9 |
| 4 | చిత్తూరు, కడప, అనంతపురం మరియు కర్నూలు. | 18 | 11 |
| 5 | ఆదిలాబాదు, కరీంనగర్, వరంగల్ మరియు ఖమ్మం. | 15 | 9 |
| 6 | రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్ నగర్, మెదక్ మరియు నల్గొండ. | 17 | 10 |
| 7 | హైద్రాబాద్ నగరం | 4 | 2 |
| | మొత్తం | 100 | 60 |

నోట్ : స్థానికులకు కేటాయించిన పోస్టులు గాక మిగిలిన 20,30 లేక 40 శాతం పోస్టులను స్థానికులు మరియు స్థానికేతరులచే ముందుగా భర్తీ చేసి ఆ తరువాత 80, 70 లేక 60 శాతం పోస్టులను స్థానికులచే భర్తీ చేయాలి. (జీ.ఓ.ఎం.ఎస్.నెం. 124, తేది 7.3.2002, ఉద్యోగ క్రాంతి ఏప్రిల్ 2002) ఈ రిజర్వేషన్లు ప్రత్యక్ష నియామకాలకే కాకుండా ప్రమోషనులకు కూడ వరిఈస్తాయని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. (1991 సప్లి.(2) ఎస్.సి.సి. 367.)

సాధారణంగా ఏ లికల్ కేడరు ఉద్యోగులు ఆ లోకల్ ఏరియాలోనే పనిచేయాలి. కాని ఏదేని లోకల్ కేడరు నుండి రాష్ట్రపతి ఉత్తర్వు వర్తించని పోస్టు లేక ఆ పోస్టు నుండి ఇతర లోకల్ కేడరుకు లేదా ఒక లోక్ కేడరు నుండి మరొక లోకల్ కేడరుకు బదిలీలు చేయడానికి కొన్ని

షరతులకు లోబడి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారమివ్వబడింది. రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించని రాష్ట్ర స్థాయి కార్యాలయాలు/సంస్థలు, ప్రత్యేక కార్యాలయాలు/సంస్థలు, శాఖాధిపతి కార్యాలయాలు మరియు సెక్రటేరియట్ లోని అన్ని పోస్టులు, మేజర్ డెవలప్ మెంట్ ప్రాజెక్టులలోని గజిటెడ్ పోస్టులు మరియు హైదరాబాదు నగర పోలీసు చట్టం 1348 ఫస్లీలోని సెక్షన్ 3 క్లాజు (బి)లో నిర్వచించిన పోలీసు ఆఫీసరు పోస్టులకు ఏ ఇతర లోకల్ కేడరు నుండైనా బదిలీ చేయవచ్చును. అయితే సాధ్యమైనంత వరకు ఆ లోకల్ కేడరులోని పోస్టుల సంఖ్య(బేసిక్ స్ట్రెంగ్త్) దామాషాలోనే ఈ బదిలీలు జరగాలి. అనగా రూల్స్ లో అనువతించిన కోటా ప్రకారం సాబార్డినేటు ఆఫీసుల నుండి శాఖాధిపతి కార్యాలయమునకు చేసే బదిలిలు కూడ ప్రతి జిల్లా/జోన్ నుండి ఆ జిల్లా/జోన్ లోని పోస్టుల సంఖ్య దామాషాలోనే జరగాలి. రాష్ట్రపతి ఉత్తర్వు వర్తించని కార్యాలయాలలో/జోన్ లలో పనిచేస్తున్న నాన్ గెజిటెడ్/ గెజిటెడ్ ఉద్యోగులకు ఆ దామాషాలోనే అవకాశం ఇవ్వాలి. ఈ బదిలీలన్నీ ప్రత్యేక పరిస్థితులలో ఈ క్రింది కారణాలపై మాత్రమే ప్రభుత్వానికే అధికారం ఉన్నది. ఏ ఇతర అధికారికి ఈ అధికారం దఖలు పరచలేదు.

1). అవసరమైన విద్యార్హతలు గలవారు, యోగ్యులైనవారు అందుబాటులో లేనపుడు.

2). ప్రజా ప్రయోజనాల దృష్ట్య అవసరమైనపుడు. ఉదా : ఎసిబి కేసులు శాఖాపర క్రమశిక్షణా చర్యల విషయంలో.

3). పరస్పర ప్రాతిపదికన అర్హత గ ఉద్యోగులను ఒక లోకల్ కేడరు నుండి మరొక లోకల్ కేడరుకు. (జీ.ఓ.ఎం.ఎస్.నెం. 569, జి.ఎ. (సర్వీసెస్-ఎ) డిపార్ట్ మెంట్, తేది. 22.8.1977 మరియు (జీ.ఓ.ఎం.ఎస్.నెం. 539, జి.ఎ. (సర్వీసెస్-ఎ) డిపార్ట్ మెంట్, తేది. 15.10.1981)

అయితే భార్యాభర్తలిరువురు ప్రభుత్వ ఉద్యోగులై వేరువేరు ప్రాంతాలలో పనిచేస్తున్నచో వారిని ఒకేచోటుకు తీసుకురావడానికి చేసే బదిలీలు ప్రజా ప్రయోజనాల క్రిందనే కొన్ని షరతులకు లోబడి పరిశీలించవచ్చును. (యు.ఓ.నోట్ నెం. 1588/ఎస్.పి.ఎఫ్.ఎ/77-1, 3.10.1977).

1. భార్యాభర్తలిరువురు రాష్ట్ర ప్రభుత్వ/ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్నపుడు.
2. ఒకరు కేంద్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తుండగా మరొకరు రాష్ట్ర ప్రభుత్వ/ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్నపుడు.

అయితే ఒకరు రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తుండగా మరొకరు ప్రైవేటు ఉద్యోగి అయినచో బదిలీ పరిశీలించనవసరం లేదని ప్రభుత్వం పేర్కొంది (యు.ఓనోట్.నెం. 1030/ఎస్.పి.ఎఫ్-ఎ/82-1, తేది 20.11.1982). ఈ బదిలీలు స్పష్టమైన ఖాళీలలోనే చేయాలి. ఫీడర్ లికల్ కేడర్ లోని ఉద్యోగుల ప్రమోషన్ అవకాశాలకు భంగం కలుగరాదు. బదిలీ కోరువారు కనీసం 2 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి ఉండాలి. మరియు బదిలీ అయినవారు కొత్త స్థానంలోని రెగ్యులర్ ఉద్యోగుల జాబితాలో చివరి ర్యాం కు తీసుకోవాలి.(యు.ఓ.నోట్ నెం. 949/ఎస్.పి.ఎఫ్-ఎ/81-1, తేది 25.8.1991). అంతేగాక ప్రభుత్వ ఉద్యోగి భార్య/భర్త యూనివర్సిటీలో, మున్సిపాలిటీలి, సహకార సంస్థలో లేక ప్రభుత్వేతర సంస్థలలో పనిచేస్తున్నపుడు పైన పేర్కొన్న షరతులకు లోబడి బదిలీని పరిశీలించవచ్చును (యు.ఓ.నోట్ నెం. 555/ఎస్.పి.ఎఫ్.-ఎ/911, తేది. 4.10.1991).

వివిధ కమిటీలు - 610 జీ.ఓ.

ఉద్యోగుల్ను వివిధ లోకల్ కేడర్ లకు కేటాయించడంలో రాష్ట్రపతి ఉత్తర్వు ఖచ్చితంగా పాటించలేదని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సరిదిద్దే చర్యలు సూచించేందుకు 3 సీనియర్ ఆఫీసర్లతో ఆఫీసరుల కమిటీ ఏర్పాటు చేయబడింది, ఈ కమిటీ నివేదికను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలను సూచించమని శ్రీ వి. సుందరేశన్, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారితో మరొక ఏకసభ్య కమీషన్ ను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ 3 ఆఫీసరుల కమిటీ సిఫారసులు మరియు సుందరేశన్ కమీషన్ అభిప్రాయాలను తేది 10.07.1985 జరిగిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో వ్యక్తపరచిన సూచనలను మరియు తేది 29.08.1985న జరిగిన మూడు ఉద్యోగ సంఘాల ( ఎ.పి. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం, ఎ.పి. ఎన్జీవోల సంఘం మరియు తెలంగాణ ఎన్జీవోల యూనియన్) అభిప్రాయలను పరిగణించి 3 ప్రధాన సమస్యలపై నిర్ణయాలు తీసుకొన్నది. (జీ.ఓ.నెం. 519, తేది.18.11.1985)

1. ప్రారంభంలో చేసిన లోకల్ కేడర్ కేటాయింపులు తిరగదోడరాదు.
2. ఒక లోకల్ కేడర్ నుండి మరొక లోకల్ కేడర్‌కు బదిలీ విషయంలో ఆచరణలో ఉన్న విధానాన్నే కొనసాగించాలి.
3. రాష్ట్రపతి ఉత్తర్వు వర్తించని రాష్ట్ర స్థాయి సంస్థలు, శాఖాధిపతి కార్యాలయాలు మరియు సెక్రటేరియట్ లోని నియామకాలలో అమలవుతున్న పాలసీనే కొనసాగించాలి. అందులోని ఖాళీలను స్థానికులకు రిజర్వు చేయనవసరం లేదు.

ఇది ఇలా ఉండగా రాయలసీమ, తెలంగాణ లోని కొంతమంది ఉద్యోగుల కేటాయింపులో రాష్ట్రపతి ఉత్తర్వును ఉల్లంఘించారని ఎ.పి. ఎన్జీవోల సంఘం మరియు తెలంగాణ ఎన్జీవోల సంఘం చేసిన విజ్ఞప్తులను పురస్కరించుకొని ప్రభుత్వం ఆ సంఘాల ప్రతినిధులతో చర్చించి

ఒప్పందాలు కుదుర్చుకొన్నది. రాయలసీమ విషయంలో జీ.ఓ.ఎం.ఎస్.నెం 564, తేది 5.12.1985లో మరియు తెలంగాణ ప్రాంతానికి సంబంధించి జీ.ఓ.ఎం.ఎస్.నెం 610, తేది 30.12.1985లో, రాష్ట్రపతి ఉత్తర్వుకు విరుద్ధంగా బదిలీలు పొందినవారిని తమతమ జోన్/జిల్లాలకు వెనక్కి పంపాలని ఆదేశించారు.

జీ.ఓ.ఎం.ఎస్.నెం 610 అమలులో అన్యాయం జరిగినట్లు భావించిన వ్యక్తులు మరియు ఉద్యోగ సంఘాల నుండి విజ్ఞప్తులు తీసుకొని అవకతవకలను గుర్తించమని, వాటిని సరిదిద్దడానికి అవసరమైన చర్యలను సూచించమని రిటైర్డ్ ఐ.ఎ.ఎస్ అధికారి శ్రీ జె.ఎమ్. గిర్ గ్లాని నేతృత్వంలో మరొక ఏకసభ్య కమీషన్ ఏర్పాటు చేశారు. (జీ.ఓ.ఎం.ఎస్.నెం 270, తేది. 25.6.2001.) ఈ కమీషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘనలను పేర్కొన్నది.

## గిర్‌గ్లానీ ఏకసభ్య కమీషన్ ప్రకటించిన ఉల్లంఘనలు

1. రాష్ట్రపతి ఉత్తర్వు నుండి మినహాయించిన కార్యాలయాలలోని పోస్టులు స్థానికులతో భర్తీ చేయాలన్న నిబంధన లేదన్న సాకుతో ఇతర లోకల్ కేడర్ నుండి స్థానికేతరులను డిప్యుటేషన్, ఆన్ అదర్ డ్యూటీ, బదిలీపై నియామకం, టెన్యూర్ బేసిస్ అను పేర్లతో దొడ్డిదారిన అక్రమంగా ప్రవేశింపజేశారు. జీ.ఓ.ఆర్.పి.నెం 728, తేది 1.11.1975 పేరా 9(బి)లోని న్యాయమైన వాటా విషయం మరచారు.
2. ప్రాంతీయ కార్యాలయ పోస్టులను, శాఖాధిపతి కార్యాలయాలలోని ఫీల్డ్ ఆఫీసు పోస్టులను శాఖాధిపతి కార్యాలయ పోస్టులుగా భావించి రాష్ట్రపతి ఉత్తర్వు అమలు చేయలేదు. ఉదా: టౌన్ ప్లానింగ్ డైరెక్టరేట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు స్టేట్ ఆర్కీవ్స్.
3. ప్రాజెక్టు పనులు పూర్తయి ప్రాజెక్టు పోస్టుల అవసరం తీరిపోయినప్పటికి ఆ పేరున స్థానికేతరులను తీసుకొని డిపార్టుమెంట్ పనులు తీసుకొంటున్నారు.
4. ప్రాజెక్టు ప్రధాన కార్యాలయాన్ని శాఖాధిపతి కార్యాలయంగా భావించి లోకలైజేషన్ విధానాన్ని అనుసరించలేదు.
5. భవిష్యత్తులో పనిభారముంటుందన్న సాకుతో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి సిబ్బందిని తరలించారు. ఇలా చేయడం వల్ల స్థానికుల ప్రయోజనాలు దెబ్బతిన్నాయి. ఉదా: 54 ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టరుల పోస్టులు ఆంధ్ర ప్రాంతానికిన తరలించారు.
6. ఏ విధమైన న్యాయబద్ధ ఆధారం, ప్రమాణం లేకుండా కొన్ని పోస్టులు జోన్ల నుండి శాఖాధిపతి కార్యాలయానికి మళ్ళించి స్థానికుల, పదోన్నతి అవకాశాలు హరించారు.
7. ప్రభుత్వ శాఖల్లోని కొన్ని సంస్థల కార్యాలయాలను శాఖాధికారి కార్యాలయాలుగా భావించి రాష్ట్రపతి ఉత్తర్వు ఉల్లంఘించి నియామకాలు చేశారు. ఉదా: ఫైర్ సర్వీస్ ట్రైనింగ్ స్కూల్స్, స్టేట్ హెల్త్ ట్రాన్స్ పోర్టు ఆర్గనైషన్, ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్.
8. శాఖాధిపతి కార్యాలయంలో విలీనమైన ప్రాంతీయ కార్యాలయ పోస్టులను కూడ శాఖాదిపతి కార్యాలయ పోస్టులుగా భావించినందున ఆ పోస్టులలో నియామకానికి, పదోన్నతికి అర్హులైన స్థానిక అభ్యర్థుల అవకాశాలు కోల్పోయారు.
9. ఇరిగేషన్ రోడ్లు, భవనాలు మరియు పంచాయతీరాజ్ శాఖలలో మొత్తం 40,870 వర్క్ ఛార్జ్డ్ సిబ్బంది నియామకమైనారు. వీరేగాక పబ్లిక్ హెల్త్, గిరిజన సంక్షేమశాఖలు మరియు హైదరాబాదు మెట్రో వాటర్ వటర్ వర్క్స్ సేవరేజ్ బోర్డులోని ఇంజనిరింగ్ విభాగంలో పనిచేసే వర్క్ ఛార్జ్డ్ సిబ్బంది వివరాలు కమీషన్ కు సమర్పించలేదు. ఈ వర్క్ ఛార్జ డ్ సిబ్బంది వేతనం ప్రభుత్వ ఖజానా నుండి చెల్లించుచున్ననూ వారి నియామకాలు, పదోన్నతి, బదిలీలలో రాష్ట్రపతి ఉత్తర్వు వర్తింపజేయలేదు.
10. మెమో నెం. 220/స్వీసెస్-ఎ/91-1, తేది. 20.02.1991లో మిగులు సిబ్బంది అబ్జార్ ష్షన్ ప్రత్యక్ష నియామకంగా భావిమ్చాలని స్పష్టంగా వివరించినప్పటికి 21,866 వర్క్ ఛార్జ డ్ మిగులు ఉద్యోగుల మరియు ఇతర ఉద్యోగులను రాష్ట్రపతి ఉత్తర్వుకు విరుద్ధంగా ఆ ఉద్యోగుల స్థానిక స్థితి పరిగణనలోనికి తీసుకొనకుండా అబ్జార్బు చేశారు.
11. రాష్ట్రపతి ఉత్తర్వు జారీ చేసేనాటికి నాన్ గెజిటెడ్‌గా ఉన్న కొన్ని పోస్టులను ఆ తరువాత గెజిటెడ్ పోస్టులుగా మార్చినారు. ఆ పోస్టుఇల స్థానిక లక్షణం మారనప్పటికీ నియామకాలని స్థానికుల రిజర్వేషన్ 70 శాతం నుండి 60 శాతం తగ్గించారు.
12. ఎ.పి.పి.ఎస్.సి. లేదా డి.ఎస్.సి. ద్వారా కాకుండా ఎంప్లాయ్ మెంట్ ఎక్ఛ్సేంజ్ ద్వారా నియమిమ్చిన అభ్యర్థుల స్థానికత్వం ఎంప్లాయ్ మెంట్ అధికారిగాని, నియామకాధికారిగాని పరిశీలించలేదు. దాని పర్యవసానంగా స్థానికేరరులు రాష్ట్రపతి ఉత్త్ర్వుకు విరుద్దంగా నియామకమైనారు.
13. 20 శాతం, 30 శాతం లేదా 40 శాతం ఖాళీలు మెరిట్ ప్రకారం స్థానికులతోను, స్థానికేరతులతోను భర్తీ చేయవలసి ఉండగా ఆ ఖాళీలు స్థానికేతరులకు కేటాయించి రాష్ట్రపతి ఉత్తర్వు ఉల్లంఘనకు పాల్పడ్డారు.

14. జీ.ఓ.ఎం.ఎస్.నెం. 369, తేది 12.12.2001లో జారీచేసిన పంచాయతీ కార్యదర్శుల సర్వీసు రూల్స్ లో రాష్ట్రపతి ఉత్తర్వు ప్రస్తావన లేదు. దాని పర్యవసానంగా స్థానికుల రిజర్వేషన్ అమలు చేయలేదు.
15. సుందరేశన్ కమిటీకి ప్రతిపాదనలు పంపి సర్వీసు రూల్స్ రాష్ట్రపతి ఉత్తర్వుకు అనుగుణంగా సవరింపజేసుకోనందున వివిధ శాఖల ఉద్యోగుల స్వీసు రూల్స్ లోకల్ కేడరుల కనుగుణంగా నియామక యూనిట్లు, పదోన్నతి అవకాశాలు కల్పించలేదు. రాష్ట్రపతి ఉత్తర్వు పేరా 11 ప్రకారం తద్విరుద్ధంగా ఉన్న రూల్స్ చెల్లనప్పటికీ ఆ రూల్సే అమలు పరుస్తున్నారు.
16. కొన్ని కార్యాలయాలు శాఖాధిపతి కార్యాలయాలుగా వర్గీకరించి ఉద్యోగుల నియామకాలలో రాష్ట్రపతి ఉత్తర్వును మినహాయించారు. చాలావరకు అలాంటి ఆఫీసులు హైద్రాబాదు నగరంలోనే ఉండటం వలన హైదరాబాదు జిల్లా మరియు 6వ జోన్ కు చెందిన స్థానికులపై ప్రతికూల ప్రభావం పడింది.
17. రాష్ట్రపతి ఉత్తర్వు నుండి మినహాయించిన హైకోర్టు, ట్రిబ్యునల్స్ తప్ప ఇత కోర్టులలోని ఉద్యోగాలలో రాష్ట్రపతి ఉత్తర్వు అమలుపరచలేదు.
18. సంబంధిత జోన్ తో నిమిత్తం లేకుండా పార్ట్ టైం జూనియర్ లెక్చరర్‌లను నియమించిన తరువాత వారి సర్వీసులు క్రమబద్దీకరణ చేశారు.
19. రాష్ట్రపతి ఉత్తర్వుకు విరుద్ధంగా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంటానికి బదిలీలు చేయడం వలన స్థానికుల ప్రయోజనాలు దెబ్బతిన్నాయి.
20. స్థానిక సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు, సొసైటీలకు, సహకార సంస్థలకు, సహకార సంస్థలలో ఫారెన్ సర్వీసుపై స్థానికేతరులను డిప్యుటేషన్ పై తీసుకొన్నారు.
21. హుడా మరియు ఇతర అర్బన్ డెవలప్ మెంట్ ఏజన్సీలలో నియామకాలు, పదోన్నతులు డెప్యుటేషన్ లలో రాష్ట్రపతి ఉత్తర్వు పాటించలేదు.
22. జోనల్ పోస్టులను జిల్లా స్థాయి సీనియారిటి ఆధారంగా ఆ జిల్లాల్లో పదోన్నతి కల్పించారు. కొన్ని జోనల్ పోస్టులను కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా మల్టీజోన్ గా మార్చారు. ఉదా: వి.డి.ఓ. గ్రేడ్, యం.పి.డి.ఓ.
23. ప్రాంతీయ కార్యాలయం మరియు సబార్డినేటు కార్యాలయంలోని ఒకే లోకల్ కేడర్ ఉద్యోగుల బదిలీలకు ఉద్దేశించిన మినిస్టీరియల్ సర్వీస్ రూల్ 16-ఎ క్రింద ఇంటర్ కేడర్ బదిలీలు చేశారు. ( జీ.ఓ.పి.నెం. 728, తేది 1.11.1975, పేరా 10(బి)కు విరుద్ధంగా)

ఉల్లంఘనలు సరిదిద్దుటకై గిర్‌గ్లానీ కమీషన్ సిఫారసులు :

1. జి.ఎస్.ఆర్. 527-ఇ క్రింద రా ష్ట్రస్థాయి కార్యాలయాల జాబితాలో క్రింది కార్యాలయాలని చేర్చాలి.
   ఎ). వాలంతరి, ఇరిగేషన్ డిపార్టుమెంటు
   బి). విజిలెన్స్ మరియు ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరు జనరల్ కార్యాలయం - సాధారణ పరిపాలన శాఖ
2. వర్క్ ఛార్జ్ డ్ సిబ్బంది నియామకాలు, పదోన్నతి, బదిలీలలో కూడా రాష్ట్రపతి ఉత్తర్వులు అమలు పరచాలి.
3. రాష్ట్రపతి ఉత్తర్వు నుండి మినహాయించిన కార్యాలయాలలో ప్రత్యక్ష నియామకానికి లోకలైజేషన్ స్కీం వర్తించకున్నను ఆ కార్యాలయాలలోని పోస్టులను డెప్యుటేషన్ తో భర్తీ చేసినచో జీ.ఓ.పి.నెం. 728, పేరా 9(బి) ప్రకారం న్యాయమైన వాటాను పరిగణనలోకి తీసుకోవాలి.
4. రాష్ట్రపతి ఉత్తర్వు నిండి మిన్హాయించిన కార్యాలయాలలో నియామకాలు, పదోన్నతులు, బదిలీలు రాష్ట్రపతి ఉత్తర్వు మేరకే జరగాలి.
5. హైదరాబారులో ఉన్న దిగువ తెల్పిన కార్యాలయాలలోని పోస్టుల భర్తీకి హైదరాబాదు జిల్లా, 6వ జోన్ లోకల్ కేడర్లుగా ప్రకటించాలి.
   - రాష్ట్రపతి ఉత్తర్వు మినహాయింపు లేని కోర్టులు.
   - ఎస్టేటు ఆఫీసరు
   - మైనారిటీ వెల్ఫేర్ జిల్లా అధికారి
   - పే మరియు అకౌంట్స్ ఆఫీసు
   - డిస్ట్రిక్ గెజిటీర్స్ స్టేట్ ఎడిటర్ కార్యాలయం
   - హైదరాబాదు వాటర్ సప్లయి, సేవరేజ్ బోర్డు
   - శాఖాధిపతి కార్యాలయంలోని ఇతర క్షేత్ర విభాగాలు.
     ఉదా: చీఫ్ ఇంజనీర్ కార్యాలయం

- మేజర్ ప్రాజెక్టులలో ప్రధాన కార్యాలయాలు

6. ప్రజా ప్రయోజనాలకు భంగకరంకాని పరస్పర బదిలీలు రద్దుపరచాలి.
7. ఒక లోకల్ కేడర్ నుండి మరొక లోకల్ కేడర్ కు జరిగిన బదిలీలు ప్రతి సంవత్సరం సమీక్షించి పరిమితికి మించియున్న స్థానికేతరులను వారి సంబంధిత లోకల్ కేడర్‌కు పంపించాలి.
8. ఒక లోకల్ కేడర్ నుండి మరొక లోకల్ కేడర్‌కు ఉద్యోగుల కోరికపై బదిలీలు సాధారణంగా అనుమతించకూడదు.
9. ఆంక్షలు విధించిన తదుపరి జరిగిన బదిలీలు రద్దుపరచి అందుకు బాధ్యులైన అధికారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలి.
10. రాష్ట్రపతి ఉత్తర్వుకు విరుద్ధంగా బదిలీ అయిన వారిని వారి లోక్ కేడరుకు రిపాట్రియేట్ చేయాలి.
11. డిప్యుటేషన్ పైనగాని, ఫారెన్ సర్వీసు నిబంధనలపై గాని ఉద్యోగులను వారికి సంబంధించిన లోకల్ కేడర్‌లోని కార్యాలయాలకే బదిలీ చేయాలి.
12. ప్రాజెక్టు పోస్టు పేరున డిప్యుటేషన్‌లు ఆపుచేసి ఆ విధంగా డిప్యుట్ చేయబడినవారిని వారి లోకల్ కేడర్ కు పంపించాలి.
13. రాష్ట్రపతి ఉత్తర్వు ప్రకారం ఏర్పాటు చేయబడిన లోకల్ కేడరుల కనుగుణంగా ప్రాంతీయ కార్యాలయాల అధికార పరిధులు మార్చి పరిమితికి మించి ఉన్న స్థానికేతరులని వారికి అంబంధించిన లోకల్ కేడరుకు రిపాట్రియేట్ చేయాలి.
14. శాఖాధిపతి కార్యాలయాలలో విలీనం చేసిన ప్రాంతీయ కార్యాలయపు లోకలైజ్డ్ పోస్టులను అంబంధిత లోకల్ కేడరుకు చెందినవిగానే భావించి వారికి సీనియారిటీ, ప్రమోషనులు ముందు తేదీ నుండి ఇవ్వాలి.
15. అన్ని అర్బన్ డెవలప్ మెంట్ ఏజెన్సీలను రాష్ట్రపతి ఉత్తర్వు పరిధిలోనికి తీసుకురావాలి.
16. కోటాకు మించి ఉన్న డిప్యుటేషనిస్టులను వారి మాతృశాఖకు పంపించివేయాలి సంబంధిత యూనిట్‌ల నుండి పరిమితి మేరకు డిప్యుటేషన్‌లు అనుమతించి ఆ లోటు భర్తీ చేయాలి.
17. ఉద్యోగులను ఉన్నత పదవికి డిప్యుటేషన్ పై పంపించే పద్ధతి మానుకోవాలి. ఆ ఖాళీలలో అర్హులైనవారికి ముందు తేదీ ఉండి పదోన్నతి కల్పించాలి.
18. రాష్ట్రపతి ఉత్తర్వు నుండి మినహాయించిన కార్యాలయాల నుండి ఇతర కార్యాలయాలకు డెప్యుటేషన్ పై పంపించకుండా ఆంక్షలు విధించాలి.
19. కాలపరిమితికి మించి డెప్యుటేషన్‌పై ఉన్న ఉద్యోగులను తిరిగి పంపించి వేయాలి.
20. మిగులు సిబ్బందిని వారికి సంబంధించిన లోకల్ కేడర్‌లోనే ఎబ్జార్బు చేయాలి.
21. దిగువ తెల్పిన కార్యాలయాలను/సంస్థలను రాష్ట్రపతి ఉత్తర్వు మినహాయింపు నుండి తొలగించి లోకల్ కేడర్ లు ఏర్పాటు చేసి స్థానికేతరులను సంబంధిత లోకల్ కేడరులను రిపాట్రియేట్ చేయాలి. తదనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వు సవరించుకోవాలి.
    - మేజర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులోని అన్ని కేటగిరీల పోస్టులు.
    - ట్రాన్స్ పోర్టు, పారెస్టు డిపార్టుమెంట్ లలోని ఫ్లయింగ్ స్క్వాడ్స్
    - మొబైల్ సర్వే పార్టీలు
    - కాఫీ సర్కిల్, విశాఖపట్నం
    - ఫారెస్టు పారెస్టు డిపార్టుమెంట్ లలోని వర్కింగ్ ప్లాన్ డివిజనులు, లాగింగ్ ప్రాజెక్టు సర్కిలు ఖమ్మం, వైల్డ్ లైఫ్ మేనేజిమెంటు సర్కిళ్ళు.
    - పఅంచాయతీరాజ్ లోని రిగ్స్ డివిజన్లు, రిగ్స్‌వర్కు షాపులు, విజిలెన్స్ మరియు క్వాలిటీ సర్కిలు, విజిలెన్సు సెల్, క్వాలిటీ కంట్రోల్ డివిజన్.
    - ఆర్ అండ్ బి మెకానికల్ సర్కిల్ విజయవాడ, కూడా సర్కిలు, డివిజన్లు, హైదరాబాదు, గుంటూరులలో యున్న ఎలక్ట్రికల్ డివిజన్లు.
    - ఐ.పి.యమ్.
    - ఎంప్లాయ్ మెంట్ మరియు ట్రైనింగ్ డిపార్టుమెంట్ లోని, సైనిక్ బోర్డులోని ఎల్.డి.సి. కన్న ఉన్నతమైన, అన్ని కేట్గగిరీల పోస్టులు.
22. కమీషన్ గుర్తించిన 19 శాఖలలోని గెజిటెడ్ పోస్టులను 3వ షెడ్యూలులో చేర్చి స్థానికులకు 60 శాతం రిజర్వేషన్ కల్పించాలి. 18.10.1975 తరువాత గెజిటెడ్ గా మారిన పోస్టులను 3వ షెడ్యూలు నుండి తొలగించి స్థానికులకు 70 శాతం రిజర్వేషన్ కల్పించాలి. ఇతర గెజిటెడ్ పోస్టులన్నీ రాష్ట్ర స్థాయి పోస్టులుగానే కొనసాగించాలి.

23. లోకల్ కేడర్ లోని ఖాళీలలోనే కారుణ్య నియామకాలు చేయాలి. రాష్ట్రపతి ఉత్తర్వు నుండి మినహాయించిన కార్యాలయాలలో లోకల్ కేడర్‌తో నిమిత్తం లేకుండా ఈ కారుణ్య నియామకాలు చేయవచ్చును.

24. బ్యాక్ లాగ్ ఖాళీలన్నీ లోకల్ అభ్యర్థులతోనే భర్తీ చేయాలి. విద్యాశాఖ మెమో నెం 38011/సర్వీసెస్-ఆరు.ఎ/97, తే. 29.11.1997లోని ప్రొసీజరు అన్ని శాఖలకు వర్తింపజేయాలి.

25. ఇమ్ప్లిమెంటేషన్ మరియు మోనిటరింగ్ అథారిటీని ఏర్పాటుచేసి ఈ సిఫారసులను అమలుపరచాలి. మొదలగునవి.